# ఎవరు మీరు?

కొల్లాటి రంగారావు

"హలో..." రోడ్డు ఆవలి వైపు నుంచి చెయ్యెత్తి పిలుస్తున్న ఆ వ్యక్తిని చూసాడు ప్రకాశ్. అతనెవరో, ఎప్పుడు అతనితో తనకు పరిచయం ఏర్పడిందో జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ ఎంతకీ జ్ఞాపకం రావడంలేదు.

బుర్రమీద చేత్తో గోక్కుని సభ్యతగా చెయ్యెత్తి విష్ చేసాడు జ్ఞాపకం వున్నట్టు చిరునవ్వు నవ్వేసి.

రోడ్డు క్రాస్ చేద్దామంటే వాహనాల రద్దీవల్ల వీలు కాలేదు.

ఆ వ్యక్తే వాహనాలను తప్పించుకుంటూ ముందుకు వచ్చి ప్రకాశ్‌కి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.

"బాగున్నారా మిస్టర్ ప్రసాద్?"

"బాగున్నాను. కానీ నా పేరు ప్రసాద్ కాదండీ ప్రకాశ్"

అతను వయసులో తనకంటే పది పన్నెండేళ్ల పెద్దవాడు, సుమారుగా ముప్ఫయి అయిదేళ్ల వయసు వుంటుందతనికి.

"మీ నాన్నగారు నారాయణమూర్తిగారు బాగున్నారా?"

"బాగున్నారు. కానీ మా నాన్నగారి పేరు నారాయణమూర్తికాదు, సూర్యనారాయణగారు"

"ఆ... అదే... అదే... మీ నాన్నగార్ని చూసి చాలా కాలమైంది. సుమారుగా ఐదేళ్లు అయి వుంటుంది."

"ఊహూ"

"మీ నాన్నగారు నిజంగా దేవుడులాంటి మనిషి. ఆయనలాంటి ధర్మమూర్తి ఇక పుట్టడు. నేను కూడా గతంలో మీ నాన్నగారి ద్వారా రెండు మూడు సహాయాలు పొందాను. నీకు తెలియకపోవచ్చు. అప్పుడు నువ్వు చాలా చిన్నవాడివి. నేను చదువుకునే రోజుల్లో నా ఫీజులు కట్టి పుస్తకాలు కొనిచ్చేవారు మీ నాన్నగారు. ఒకరికి సహాయం చేయడమేగానీ తిరిగి సహాయం పొందే తత్వంకాదు ఆయనిది. సూర్యనారాయణగార్ని మేం తలచుకోని రోజంటూ వుండదు మిస్టర్ ప్రకాశ్"

"క్షమించండి. ఇంతసేపు మిమ్మల్ని ఎండలో నిలబెట్టి మాట్లాడించాను. పదండి. అలా


హోటల్లో కూర్చుని మాట్లాడుకుందాం'' కదిలాడు ప్రకాశ్.

''అలాగే''

ఎదురుగా వున్న హోటల్ మానస సరోవర్ టిఫిన్ సెక్షన్‌లో కూర్చున్నారు ఇద్దరు.

టిఫిన్ ఆర్డర్ చేసాడు ప్రకాశ్.

''ఇంతకీ మీరిప్పుడు రాజమండ్రిలోనే వుంటున్నారా? అడిగాడు.



''లేదండీ. పిఠాపురంలో వుంటున్నాం''

''మీ అమ్మగారు పిండివంటలు అద్భుతంగా చేస్తారు. నిజంగా ఆమెవి అమృత హస్తాలే. మీ తల్లిదండ్రులని చూస్తుంటే నాకు పార్వతీ పరమేశ్వరుల్లా అనిపిస్తుంటారు.''

ఇబ్బందిగా నవ్వాడు ప్రకాశ్.

''ఇంతకీ మీ పేరు చెప్పలేదు''

''అవును. మాటల్లోపడి మర్చేపోయాను సుమా. నా పేరు దివాకర్రావు. దివాకర్ అని చెబితే చాలు. మీ నాన్నగారికి, అమ్మగారికి చప్పున నేను గుర్తుకు వస్తాను''

''చాలా సంతోషం. మిమ్మల్నిలా కలసినందుకు నాకు చాలా ఆనందంగా వుంది'' అన్నాడు ప్రకాశ్.

''నాకూ అంతే''

అది స్టార్ హోటల్ కావడంవల్ల టిఫిన్ రావడానికి కనీసం పావు గంట పడుతుంది.

ఇంకేం మాట్లాడాలో తెలియక దివాకర్రావు తన రాజకీయ చాతుర్యాన్ని ప్రకాశ్ ముందు పరుస్తున్నాడు.

తనకిష్టంలేని ఆ రాజకీయ గోల వింటూ ఊ కొడుతూ జేబులోంచి అరఠావు తెల్లకాగితం తీసి ఇంటిమీద పెంకుల పేర్పులా ఆ

కాగితాన్ని చిత్రంగా మడతలుపెట్టి ఆ మడతల లోపలి భాగాల్లో ఒకో మడతలో ఒకో ప్రశ్న చొప్పున పధ్నాలుగు ప్రశ్నలు రాసాడు ప్రకాశ్.

''రాజకీయాలు నీకు నచ్చవనుకుంటాను. నువ్వు చేసే పనేమిటి మిస్టర్ ప్రకాశ్?''

''ఓ మేజిక్''

''నువ్వు మేజిక్కులుకూడా చేస్తావా? నాకు తెలియదే''

''ప్రదర్శించమంటారా?''

''తప్పకుండా. మేజిక్‌లంటే నాకు చాలా ఆసక్తి. పొగడ్తకాదుగానీ అదో కళ. అది అందరికీ అలవడదు. ఆ కళ నీకు దేవుడిచ్చిన వరం అన్నమాటే''

ఆ కాగితం అందిస్తూ చెప్పాడు ప్రకాశ్ ''ఈ కాగితం మీద అరంగుళం వెడల్పున పధ్నాలుగు అంచులున్నాయికదా. ఆ అంచులను ఎత్తి చూస్తే నేను రాసిన ప్రశ్నలు పధ్నాలుగు కనిపిస్తాయి. అంచులు ఎత్తి చూడకుండా ఆ అంచులమీద నేను చెప్పిన ప్రశ్నలకు జవాబులు పదమూడు మీరే రాయండి. మనం టిఫిన్ తినడం పూర్తయిన తరువాత నేను రాసిన ప్రశ్నలు మీరు రాసిన జవాబులు కలిపి చదువుకోండి. మీకు సంబంధించిన ఆ ప్రశ్న జవాబులన్నీ చాలా ఖచ్చితంగా సరిపోతాయి. అప్పుడు పధ్నాలుగో ప్రశ్నకి జవాబు చిత్రంగా మీరే రాసేస్తారు'

''ఈ మేజిక్కు చాలా కొత్తగా, చిత్రంగా, ఆసక్తిగా వుంది. అలాగే జవాబులు చెప్పు. రాస్తాను''

''మీ ఉదయం స్నానం అయిందా?'' ప్రకాశ్ ప్రశ్న వేసాడు.

''అయింది అన్నాడు దివాకర్రావు.

''అయితే ఆ మాటే మీ మొదటి జవాబుగా రాయండి''

'అయింది' అన్న మాటను మొదట జవాబుగా రాసాడు దివాకర్రావు.

''మీకు స్నేహితులు వున్నారా?''

''వున్నారు''

''మీకు ఒక్క చెడ్డ అలవాటైనా వుందా?''

''లేదు''

ప్రకాశ్ వరుసగా ప్రశ్నలు అడుగుతుంటే వాటికి జవాబులు చెబుతూ ఆ జవాబుల్నే లైనుగా వున్న కాగితం అంచులమీద రాసాడు దివాకర్రావు.

ఆలోగా టిఫిన్ వచ్చింది.

ఇద్దరూ కడుపునిండా టిఫిన్ తిన్నారు.

రెండు బోర్నవిటా ఆర్డర్ చేసి ఇప్పుడే వస్తానని చెప్పి టాయ్‌లెట్‌కి వెళ్లాడు ప్రకాశ్.

★★★

పావుగంట గడిచిందిగానీ టాయ్‌లెట్‌కి వెళ్లిన ప్రకాశ్ ఇంకా రాలేదు.

ఒకవైపు సర్వ్ చేయబడిన బోర్నవీటా చల్లారిపోతోంది.

అతను వచ్చాక తాగుతాడు కదా అని తన గ్లాసు అందుకుని బోర్నవీటా పూర్తి చేసాడు దివాకర్రావు.

ఈలోగా ఖాళీగా వుండడం ఎందుకని ప్రకాశ్ తయారుచేసిన మేజిక్ పేపరు అందుకుని మొదటి అంచు ఎత్తి ప్రకాశ్ రాసిన మొదటి ప్రశ్న చదివాడు దివాకర్రావు ''మీకు పెళ్లయిందా?''

అదీ మొదటి ప్రశ్న.

అంచుమూసి తన జవాబు చూసాడు.

''అయింది'' అదీ మొదటి జవాబు.

రెండో అంచు ఎత్తాడు.

''మీకు పిల్లలున్నారా?''

అంచు మూసాడు.

''వున్నారు''

ప్రకాశ్ తెలివికి అబ్బుర పడుతూ ఒకో అంచు ఎత్తుతూ మూస్తూ ప్రశ్న, జవాబులు చదువుతున్నాడు అతడు.

3వ ప్రశ్న:

''మీకు ఉద్యోగముందా?''

''లేదు''

4వ ప్రశ్న:

''మీరు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారా?''

''లేదు''

5వ ప్రశ్న:

''మీరు బేవర్స్‌గా తిరుగుతున్నారా?''

ఉలిక్కిపడి ఆ ప్రశ్న మరోసారి చదివాడు దివాకర్రావు. పరీక్షా ఫలితాలు వచ్చాయని తెలిసి కంగారుగా పేపర్ వెదికే పదోక్లాసు విద్యార్థిలా ఐదో ప్రశ్న జవాబు కంగారుగా చూసాడు.

''అవును'' ఐదో ప్రశ్న జవాబు అది.

గుండెలు దడదడలాడుతుండగా చేతులు వణుకుతుండగా వరుసగా అన్ని ప్రశ్న జవాబులు వేగంగా చదవసాగాడు అతడు.

6వ ప్రశ్న:

''కనిపించినవాణ్ణల్లా మాటల్తో బోల్తా కొట్టించి మోసగించడమే మీ పనా?''

''అవును''

తుళ్లిపడ్డాడు దివాకర్రావు.

7వ ప్రశ్న:

''కష్టపడి ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించవచ్చుకదా?''

''అవును''

8వ ప్రశ్న:

''మరెందుకలా చేయరు?''

''ఈ ప్రశ్నకు జవాబు చెప్పను''

9వ ప్రశ్న:

''డబ్బుని కష్టపడి సంపాదించేకంటే ఎదుటి వ్యక్తిని మోసగించి సంపాదిస్తేనే మనకి ఎంతో తృప్తి కదూ?''

''అవును''

ఉలిక్కిపడ్డాడు.

10వ ప్రశ్న:

''మంచి చెడుల మధ్య వ్యత్యాసం తెలుసా?''

''తెలుసు. కానీ పాటించను''

11వ ప్రశ్న:

''మీకు మానవత్వం వుందా?''

''లేదు''

## దొంగ

కేవలం ఒకే ఒక దొంగ రాత్రి మీ ఇంట్లో దొరబడి ఉన్నదంతా దోచుకెళ్తుంటే నీవు, చెట్టంత నలుగురు కొడుకులుండీ వాన్నేమీ చేయలేకపోయారేం? అన్నాడు అప్పారావు.

చూస్తూ, చూస్తూ అల్లునిపై చేయి చేసుకోవడం ఏం బావుంటుందని ఊర్కున్నాం. అన్నాడు సుబ్బారావు

- శ్రీగడ్డ శంకర్
(అబుదాబి)

12వ ప్రశ్న:

''మానవత్వం లేదు కనుకే అందర్నీ మోసగిస్తున్నారు కదూ?''

''అవును''

13వ ప్రశ్న:

''ఎవరు మీరు?''

''ఐయామ్ ఏ ఫూల్''

తన కొంప నిలువునా మునిగిపోయిందని గ్రహించేసాడు దివాకర్రావు.

అమాయకంగా కనిపించేవాళ్లని మోసం చేయడం అతడి ప్రొఫెషన్. ఆ ప్రొఫెషనల్‌లో అతడు మొట్టమొదటిసారిగా ప్రకాశ్ విషయంలో చాలా దారుణంగా దెబ్బ తిన్నాడు. ప్రకాశ్‌ని మోసగిస్తున్నాను అనుకుంటూ తనను తనే మోసగించుకున్నాడు అతడు.

బేరర్ బిల్లు తెచ్చి దివాకర్రావుకి ఇచ్చాడు.

కంగారుగా అడిగాడు అతడు ''నాతోపాటు టిఫిన్ చేసిన వ్యక్తి ఎక్కడ?''

బేరర్ నోటి వెంట నెగెటివ్ జవాబు వచ్చింది ''బిల్లు మీరు పే చేస్తారని చెప్పి ఆయన ఎప్పుడో వెళ్లిపోయారు''

గభాలున జేబులు తడుముకున్నాడు దివాకర్రావు. జేబులో ఐదుపైసలు కూడా లేదు. బిల్లు చూస్తే మూడువందల రూపాయలు.

కొంతసేపటికి విషయం గ్రహించిన బేరర్ సీరియస్‌గా అతడివైపు కదిలాడు మెడ పట్టుకుని వంటగదిలోకి నెట్టడానికి.

నీరసంగా కుర్చీలో కూలబడి 14వ ప్రశ్న యధాలాపంగా చదివాడు దివాకర్రావు.

''ఈ జన్మలో మళ్లీ ఎవరినైనా మోసగించే ప్రయత్నం చేస్తావా?''

దివాకర్రావు ఏదో ఆవేశంతో అరిచాడు 14వ ప్రశ్నకు జవాబుగా.

''చస్తే చేయను''

''చస్తే ఎందుకు చేస్తావ్? చావకుండానే చేయిస్తాం నీచేత. పప్పు రుబ్బిస్తాం. సామాన్లు తోమిస్తాం. నాలుగు తగిలిస్తే చచ్చినట్టు నువ్వే చేస్తావ్'' మరోలా అర్థం చేసుకున్న బేరర్ దివాకర్రావు మెడ పట్టుకుని వంట గదిలోకి నెట్టేసాడు.

★

